కథ

# జీవన చిత్రం

- జి.యన్.వి.సత్యనారాయణ

**వ**యుప్పై ఆరు సంవత్సరాల బంధం.... అనుబంధం.... హఠాత్తుగా తెగిపోయింది.

తనని తానుగా చూసి... తనది అనుకున్నదీ... తనకోసం బ్రతికినదీ....దూరం అయిపోయిందంటే.... రాఘవరావు గుండెల్లో బాధ లావాలా పొంగుతోంది. అది కళ్ళను దాటి రాకుండా మనసు ఉగ్గబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. అయినా అప్పుడప్పుడు కళ్ళల్లో నీటి పొరలు ఉబుకుతున్నాయి....

రాఘవరావుకు ఇద్దరు కొడుకులు.

పెద్దకొడుకు, కోడలు, మనవలు అక్కడే కూర్చుని కంటతడి పెడుతున్నారు. ఎవరెవరో వస్తున్నారు.... అందరి పలకరింపులు... పరామర్శలు.... బయట మ్రోగుతున్న బాజాలు చెవులకు కర్కశంగా వినబడుతున్నాయి.

నట్టింట్లో నిర్జీవంగా పడి ఉంది.... రాజ్యం....

ప్రక్కనే కుర్చీలో కూర్చున్న రాఘవరావు.... నిశ్చలంగా ఉన్న రాజ్యం ముఖంకేసి అప్పుడప్పుడు చూస్తున్నాడు.

ప్రాణం ఎంత చిత్రమైంది.

నిన్నటిదాకా తనే లోకంగా బ్రతికింది. నీకు నాకు రుణం ఇంతే అంటూ ప్రాణం లేని కట్టెగా మిగిలి పోయింది. జీవితం అంటే ఇదేనా.....

కష్టాల్లోనూ.... సుఖాల్లోనూ.... సంతోషంలోనూ.... దుఃఖంలోనూ.... కోపాల్లోనూ తాపాల్లోనూ.... అనుక్షణం.... అనునిత్యం వెన్నంటి ఉండే 'అండ' పోయింది.

ఆమెతో కలిసి ఒకరికొకరు బతికిన జీవితంలో కలబోసిన ఎన్ని అనుభవాలు... అనుభూతులు... ఆలోచనలు.... అవసరాలు..... మధురమైన భావాలు.... పెనవేసుకున్న తీపి క్షణాలు... బరువులు...బాధ్యతలు..... కొడుకుల పెంపకం.... చదువులు... పెళ్ళిళ్ళు.....

ఎన్నో... ఎన్నెన్నో.....

సంసారంలో ఎన్ని ఎత్తుపల్లాలు చూసారు.....

ఒకరికొకరు తోడుగా.... నీడగా....

ఏమయిపోతాయి.... అవన్నీ.... కాలగర్భంలో కలసిపోవడమేనా....

నిన్నరాత్రి....

'ఏవండీ.... మాత్రవేసుకున్నారా...' పనులతో అలసి పడుకునే ముందు రోజూ అడిగే ప్రశ్న....

'లేదే...' మామూలు జవాబు.

కాని... రాత్రి... రాత్రి.... "రోజూ మర్చిపోతే ఎలా అండీ... నేనున్నాను కాబట్టి గుర్తుచేసి యిస్తున్నాను.... లేకపోతే..."

"నన్నొదిలి నువ్వెక్కడికి పోతావే... అయినా..." పరిహాసమాడాడు.

అంతే ! ఉదయం మామూలుగా అయిదు గంటలకు లేచే రాజ్యం లేవలేదు... అనుమానంతో గట్టిగా అరిచాడు.... పదేపదే తట్టిలేపాడు... ఊపాడు.... చలనం లేదు.... నిద్రలో ఎప్పుడు పోయిందో ఆ ప్రాణం... బావురుమన్నాడు.

జరిగింది తెలిసాక పెద్దకొడుకు కోడలు, మనవలు ఒక గంటలోనే వచ్చేసారు. చిన్నవాడు రావాలి.

'రాఘవా... కాసిన్ని కాఫీనీళ్ళు గొంతులో పోసుకో ఇదిగో...'

'వద్దురా కేశవా...'

రాఘవకి కేశవరావుతో పదేళ్ళ స్నేహం... ఇప్పుడు కేశవరావే అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నాడు.

**వృద్ధాప్యం రోజురోజుకీ అప్యాయమై సమస్యలే స్వాగతాలై బతుకు బండి సడి.... సవ్వడి...కళ... కాంతి కాస్త కాస్త తగ్గుతుండటం సహజమే అయినా ఒకప్పటి స్మృతుల నెమరు ఏమరుపాటుగా సింహావలోకనమైతే.......**

'అలా అంటే ఎలారా... చూడు ఎలా అయిపోయావో... గుండె చిక్కబట్టుకోవాలిరా...' కేశవరావు అనునయించాడు.

'ఎలారా... చూడరా... ఇంక నా రాజ్యం.... మాట్లాడదురా.... ఎప్పటికీ...నేను ఒంటరినిరా.... ఇప్పుడు... '

'ఒరేయ్... ఏడవకురా... మేమంతా లేమా... అదిగో నీ చిన్న కొడుకు కోడలు వచ్చారు... చూడు....

'నాన్నా.... అమ్మ...... అమ్మ....' ఆ కొడుకు తండ్రిని పట్టుకుని ఊపి ఏడుస్తోంటే.... అక్కడ శోకం ఉవ్వెత్తున లేచిన సంద్రమే అయింది.

- 000 -

ఇరవై రోజులు గడిచాయి.

రాజ్యం జ్ఞాపకాలు ఉండుండి తీరాన్ని తాకే అలల్లా రాఘవరావు మనసును తాకుతునే ఉన్నాయి.

మనిషి నీరసించిపోయాడు. ముఖంలో తాండవిస్తోన్న నైరాశ్యం....

ఆ యింటిని అనుకునే విడిగా చిన్న గది కట్టుకున్నాడు. ఆ గదే తనకు లోకం.... ఎక్కువసేపు అక్కడే గడిపేవాడు... ఎన్నో పుస్తకాలను పోగు చేశాడు... ఇప్పుడు ఏ పుస్తకం తీసినా భార్య ముఖమే గుర్తుకు వస్తోంది. ఏదీ చదవబుద్ధికావడంలేదు.

'రాఘవా... ఏం చేస్తున్నావు... అలా కోనేటి గట్టు దాకా వెళ్లొద్దాం...'

'వస్తున్నా...' అంటూ పుస్తకం మడిచిలేచాడు.

'ఏదైనా మాట్లాడరా....'

రాఘవరావు కళ్ళలో నీరు

'ఒరేయ్... అన్నీ మర్చిపోవాలిరా....

'ఎలా... అన్ని సంవత్సరాలు కలిసి మెలిసి... బతికి....' రాఘవరావు గొంతు మూగవోయింది.

భార్య పోయినప్పుడే 'లోటు' అన్న పదానికి అర్థం తెలిసివస్తుంది.... అన్నీ దిగమింగుకుని బతకాలిరా... కాలమే గాయాన్ని మాన్పుతుంది.

'కేశవా... ఇల్లు అమ్మేసి కొడుకులిద్దరూ వచ్చేయ్యమంటున్నారు...'

' నువ్వేం నిర్ణయించుకున్నావు....'

నా కొడుకులు.. కోడళ్ళు బాగానే చూసుకుంటారు... ఆ నమ్మకం నాకుంది... ఇక ఒంటరిగా రాజ్యంలేని ఇంట్లో బ్రతకలేనేమో.... చూశావా చిత్రం. రాజ్యం పోవడం... ఈ ఊరితో ఉన్న అనుబంధం కూడా తెంచుకోవలసి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు... ముఖ్యంగా నిన్ను... నిన్ను వదలి వెళ్ళాలంటేనే నా మనస్సుకు కష్టం కలుగుతోంది.

'నిజంగా ఈ వూరొదలి వెళ్ళిపోతావా...'

'యిల్లు అమ్మేస్తే వచ్చిన డబ్బులు నాకొడుకులిద్దరికీ ఇద్దామని వుంది. వాళ్ళు లోన్లు తీసుకుని ఉద్యోగాలు చేస్తున్న చోట్ల ఇళ్ళు కట్టుకున్నారు కదా... ఈ డబ్బు వాళ్ళకు సాయంగా ఉంటుందనే నా ఆలోచన...

"రాఘవా... ఒక్కసారి నీ గురించి కూడా ఆలోచించు... చివరి వరకు ఇల్లు ఉందనుకుంటేనే మంచిదని నా అభిప్రాయం."

"నా ఇద్దరి కొడుకుల దగ్గరా చెరొక ఆర్నెల్లు గడిపేసినా సంవత్సరం వెళ్ళిపోతుంది.... ఇక యింటితో పనేం ఉంది...."

"సరే అనుకో... మరోసారి ఆలోచించరా...."

"ఆలోచించేందుకేముంది.... నువ్వో సాయం చెయ్యాలి.... యిల్లు అమ్మే బాధ్యత నీపై పెడుతున్నా...."

"కనీసం నువ్వు ఇష్టంగా కట్టించుకున్న నీ గది... అదైనా ఉంచుకోరా.... పరిస్థితులు ఎలా వుంటాయో... ఎవరు చెప్పగలరు...?"

"ఈ ఊరినే వదలి పెడుతుండగా ఇక ఆ గదితో పనేం వుందిరా... మొత్తం అమ్మెయ్యి..."

"సరే... నీ యిష్టం..."

"మరో నాల్గు రోజుల్లో ఇల్లు ఖాళీ చేసి వెళదామని వుంది.... ఇంటి కాగితాలు అవీ యిస్తాను.. ఆపనుల మీదే ఉండు..."

"తప్పకుండా..."

కేశవ్‌ని వదల్లేక... వదల్లేక... తోటి మనుష్యుల ఆప్యాయతను వీడలేక... బాధను నింపుకుంటూ.... శోకతప్త హృదయంతో కొడుకులతో పాటు పయనమైపోయాడు రాఘవరావు.....

ఇల్లు అమ్మకానికి వచ్చిందన్న కేశవ్ కబురుతో మరోమారు వచ్చి ఆ ఊరితో ఉన్న చివరి బంధాన్ని కూడా త్రెంచుకుని వెళ్ళిపోయాడు.

రాఘవరావు, కేశవరావు ఇద్దరూ ఉత్తరాలు రాసుకునేవారు... మూడు నెలలు గడిచాయి... రాఘవరావు నుండి లెటర్స్ రావడం ఆగిపోయాయి.... హఠాత్తుగా.

ఒక రోజు కేశవరావు వచ్చిన చుట్టాల్ని బస్సెక్కించి వస్తూంటే... వేరే బస్సులోంచి రాఘవరావు దిగాడు.

కేశవ్‌ను చూసి ఒక్కసారిగా కౌగిలించుకున్నాడు.

"ఏంట్రా... రాఘవా.... గుర్తుపట్టలేనంతగా మారిపోయావు... ఇంత నీరసమైపోయావు... అసలు ఒంట్లో బాగుంటోందా... నీ కొడుకులు...."

ఆదుర్దాగా అడిగాడు.

"వాళ్లకేంరా... బానే ఉన్నారు.... ఎన్నిరోజులయి పోయిందిరా... నిన్ను చూసి...."

**నిన్నటిదాకా తనే లోకంగా బ్రతికింది. నీకు నాకు రుణం ఇంతే అంటూ ప్రాణం లేని కట్టెగా మిగిలి పోయింది. జీవితం అంటే ఇదేనా.....**

వృద్ధాప్యం రోజురోజుకీ ఆప్యాయమై సమస్యలే స్వాగతాలై బతుకు బండి సడి.... సవ్వడి...కళ... కాంతి కాస్త కాస్త తగ్గుతుండటం సహజమే అయినా ఒకప్పటి స్మృతుల నెమరు ఏమరుపాటుగా సింహావలోకనమైతే.... కలిగే ఆర్ద్రత... ఇద్దరిలోనూ..

"పద రాఘవా... మా ఇంటికెళ్దాం.." అంటూ కేశవరావు రాఘవరావుని ఇంటికి తీసుకెళ్ళాడు....

"చెల్లెమ్మేదిరా..." అడిగాడు రాఘవరావు.

"వాళ్ళ పుట్టింటికెళ్ళిందిరా... సాయంత్రం వచ్చేస్తుంది...."

సరేకాని... రాఘవా... ఎలా ఉన్నావు... ఉత్తరాలు రాయడం మానేశావ్... ఏమయింది నీకు? నన్ను మర్చిపోయావు...."

"కేశవా... నేను జీవితంలో ఘోరంగా దెబ్బ తిన్నానురా..."

ఏమయిందిరా...

'ఏంచెప్పమంటావురా... తప్పు చేశానురా... నీ మాట వినకుండా ఇల్లు అమ్మి నా కొడుకుల పంచన చేరానా...! నా నమ్మకాన్ని వాళ్ళు దెబ్బ తీశార్రా.." రాఘవ రావు కళ్ళనీళ్ళు...

"అసలేమయిందో చెప్పరా..."

"మొదట... నా పెద్దవాడి ఇంట్లో ఉండేవాడినా... నన్ను బాగా చూసుకోవాలనే తాపత్రయం వాడికి ఉండేది... కాని వాడికి ఉద్యోగ రీత్యా కేంపులెక్కువ... ఇక కోడలికి పిల్లలతోనే సరిపోయేది... నెల రోజు లయ్యేసరికి సహజంగానే విసుగు... నిర్లక్ష్యం తప్పలేదు... మొదటిసారి రాజ్యంలేని లోటు కనిపించింది.... అప్పటికీ చాలా వరకు సరిపెట్టుకున్నాను... కానీ రోజులు గడిచేకొద్దీ

నా కొడుకులు.. కోడళ్ళు బాగానే చూసుకుంటారు... ఆ నమ్మకం నాకుంది... ఇక ఒంటరిగా రాజ్యంలేని ఇంట్లో బ్రతకలేనేమో.... చూశావా చిత్రం.

నాపట్ల అలసత్వం... నిర్లక్ష్యధోరణి ఎక్కువైపోయింది. నాలో కలిగే భావాలను పెద్దోడికి చెప్పుకుందామంటే వాడిని బాధ పెట్టినవాడినవుతాను...."

కాసేపు ఆగి మళ్ళీ చెప్పసాగాడు రాఘవరావు.

"కేశవా... సతమతమయ్యే ఆలోచనలతో సర్దుకు పోదామనుకున్నా.... అన్నీ మనసును మెలిపెట్టేవే... మదిని దొలిచేవే.... బజారు పనులు అన్నీ నేనే చేసేవాడిని... మా వాడు ఇచ్చిన డబ్బుని ఖర్చు పెట్టేది కాదు నా కోడలు.... అన్నిటికీ నా పెన్షన్ డబ్బే ఖర్చు పెట్టేవాడిని. అంతా మన డబ్బే అనుకునేవాడిని... కాని ఒకరోజు 'ఏమండీ... మీరు లేనప్పుడు దేనికైనా అవసరం పడినా.... చిల్లర పైసలు కూడా ఖర్చు పెట్టరండీ... మీ నాన్నగారు...." అంటూ నా కొడుకుతో అంటుంటే తల్లడిల్లిపోయానురా... సరే... ఇక నాకు డబ్బుతో అవసరం ఏం ఉందనుకుని... ఇల్లు అమ్మిన డబ్బులు... ఫిక్సడ్‌లో ఉన్న రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ నా కొడుకులిద్దరికీ పంచేశానురా.... అవి యిస్తే నన్ను బాగా చూసుకుంటారనుకున్నాను. కొన్ని రోజులు నా పరిస్థితి బానే వుంది. మరలా మామూలే అయింది. నేను చేసింది తప్పనిపించింది...

ఒక్కోసారి రాత్రి మిగిలిన అన్నం... సరిగా వండని కూరలు... "ఒంట్లో కాస్త బాగులేకపోతే... రెండు రోజులు నలతగా ఉంటేనే ఇన్ని సేవలు చేయించుకుంటున్నారు... ఈయనగారు... ఇక మంచానపడితే చేయగలమా...!" ఇవిరా ప్రక్కింటావిడతో నా పెద్దకోడలి మాటలు... అవే నన్ను చిన్నాడింటికి పంపాయిరా..."

కళ్ళు తుడుచుకున్నాడు రాఘవరావు. అనునయంగా భుజంతట్టాడు కేశవరావు.

"ఇక చిన్నాడింటి దగ్గర పరిస్థితే వేరు.... ఇద్దరూ ఉద్యోగాలవడంతో ప్రొద్దుట వండుకుని వాళ్ళిద్దరూ వెళ్ళిపోతే ఉదయం నుండి సాయంత్రం వరకూ ఇంటికి కాపలా... పైగా నా మనవళ్ళ బరువూ... బాధ్యతలూనూ..."

కాసేపాగి మళ్ళీ చెప్పసాగాడు రాఘవరావు.

"మనవళ్ళంటే తాతకు అదోరకమైన ప్రేమ ఉంటుంది. వాళ్ళను లాలించాలని.... బుజ్జగించాలనీ... వాళ్ళతో ఆడుకోవాలనీ... మురిసిపోవాలని... కాని నా చిన్నాడింట్లో చిత్రంగా నా మనవళ్ళే నాకు బరువుగా మారిపోయారు. కారణం వాళ్ళ చదువులు... వీళ్ళ పొదుపులు... ఆటోకి అయిదు వందలు మిగులుతాయని. పిల్లలను రోజూ స్కూలుకి తీసికెళ్ళి మరలా తీసుకుని వచ్చే బాధ్యత అప్పగించారు. మొదట్లో అంత ఇబ్బందనిపించక పోయినా... రానురాను కష్టమయిపోయింది. పాపం పసివాళ్ళు అంతలేసి బరువులున్న బ్యాగులను మోయలేకపోతే నేనే మోసుకొచ్చేవాడిని.... వీళ్ళచేత రోజూ హోంవర్కు చేయించి వాళ్ళను చదివించేసరికి నా తల ప్రాణం తోక్కొచ్చేది...."

"ఒరేయ్... నాకు తెలీదా- నువ్వెంత మెత్తటి మనిషివో...? ఇదంతా సూటిగా నీ చిన్నోడికి చెప్పొచ్చు కదరా..." చెప్పాడు కేశవరావు.

"వాళ్ళకు ఇవన్నీ గమనించే ఓపిక గానీ టైమ్ కాని లేవు. విషయాలన్నీ ఒకవైపే చూస్తూ.... ఎంతో తేలికగా కాజువల్‌గా తీసుకున్నారు. ఉద్యోగం... పెళ్ళాం... పిల్లలు... సంసారంలో పడ్డాక ఎవరిజీవితం వాళ్ళదే అయి పోతుందిరా...."

"నిజంరా రాఘవా.... ఇంకో 'అదనపు' వ్యక్తిని భరించడం కష్టమైపోతుందిరా... ఈ అదనపు వ్యక్తి వల్ల ఏదైనా ప్రయోజనం ఉంటేనే వాళ్ళు భరిస్తున్నారు... వీడు మనగలుగుతున్నాడు. అయినా నీ దగ్గర ఉన్నదంతా వాళ్ళకు ఇచ్చేశాక నువ్వు నిజంగా "అదనపు వ్యక్తివే..."

'నిజం చెప్పావురా కేశవా.... ఇక అక్కడ ఇమడలేక ఏదైనా - అనాథాశ్రమంలో చేరుదామనిపించింది. ఈ పరిస్థితుల్లో మనసు బాగాలేక నీకు ఉత్తరాలు కానీ... ఫోన్‌కానీ చేయలేకపోయా... కానీ.... నీ స్నేహం చివరికి ఈ ఊరు రప్పించిందిరా...."

"డబ్బు కొంత మేరకు సుఖాన్నిస్తుందని తెలిసినా... ఉన్నదాంట్లో కాస్తంతయినా సుఖపడక... ఎక్కడ చూసినా ఇంకా సంపాదించాలనే ఆరాటంలో కొట్టు మిట్టాడుతూ ఒక రకమైన పరుగే నేటి ఈ జీవితాలు... గిరిగీసుకున్న బతుకులో ఎవరి హడావుడి వాళ్ళది.... సమాజ మార్పు వలన ఈ బంధాలు.... అనుబంధాలు... నేటి జీవనపు ఒత్తిడికి నలుగుతున్నాయి... నా కొడుకులు నాకు పాఠం నేర్పారురా....

"నిజంరా... నువ్వెంతో ముందు చూపుతో ఆలోచించి చెప్పినా నీ మాట పెడచెవిన పెట్టి... ఇల్లు అమ్మేయించాను... కనీసం .... నేనెంతో ఇష్టపడి కట్టుకున్న ఆ ఒక్క గదినైనా ఉంచుకున్నాను కాదు.... నాకు పెన్షన్ వస్తుంది కాబట్టి మన ఊళ్ళోనే ఓ రూమ్ అద్దెకి తీసుకుని నీ స్నేహం నీడలో నా శేషజీవితాన్ని గడిపేద్దామని వచ్చాన్రా...."

"చాలా సంతోషంరా... నీకో విషయం చెప్పనా.... నువ్వెక్కడా రూమ్ అద్దెకు తీసుకుని ఉండాల్సిన అవసరం కాని అగత్యంకాని లేదురా.... నువ్వెంతో ఇష్టపడి కట్టించుకున్న నీ గదిలోనే ఉండొచ్చు..."

"అంటే"

"నువ్వు నీ ఇల్లు అమ్మే బాధ్యత నాపై పెట్టావు... నువ్వు ఏనాటికైనా తిరిగి వస్తావని ఎందుకో నా మనసుకు అనిపించిందిరా.... అందుకనే మీ కెవ్వరికీ తెలియకుండా వేరుగా ఉన్న నీ గది తప్ప మిగిలిన ఇల్లంతా అమ్మకానికి పెట్టాను.... ఓ సంవత్సరం తర్వాత నువ్వు రాకపోతే ఈ సంగతి నీకు తెలియపర్చుదామనుకున్నాను..... కాని నువ్వు వచ్చేవు... నీగది నీకే ఉంది..."

"కేశవా... నిజంగా నేనిది నమ్మలేకపోతున్నాను..." రాఘవరావు కళ్ళుఆనందంతో మెరిసిపోతున్నాయి.

"నమ్మాలి... ఎందుకంటే ఇది నిజంగా నిజం కాబట్టి" చెప్పాడు కేశవరావు. రాఘవరావు భుజంమీద చెయ్యివేస్తూ...

❀❀❀

*సంక్రాంతి -2005 సందర్భంగా కార్యాలయ స్థాయిలో నిర్వహించిన కథలపోటీలో బహుమతి పొందిన కథ.*

**గీతం**

# ఇది నా తొలిపాట

**పల్లవి :** ఈ పాటకు పల్లవి నీవు
నీ మురళికి ఊపిరి నేను

**చరణం1:** అవనిలో బృందావనిలో
రమ్మని కోయిల పాట పిలిచిన వేళ
పున్నమిలో కలువ కన్నులలో
కమ్మని కలలే మెదిలిన వేళ
సిరిసిరి మువ్వల సవ్వడులే
సరిసరి నటనలు పలికిన వేళ
||ఈ పాటకు||

**చరణం2:** భావములే సుమ దీపికలై
నాకై దారుల వెలిగిన వేళ
రాగములే అనురాగములై
నీకై హారతి పట్టిన వేళ
చిరు చిరు నవ్వుల వెల్లువలె
నా చిరు మనసుకు తారకలు
||ఈ పాటకు||



**- బి. కాంతారావు**